క్లుప్తంగా

పటాన్‌చెరు ఎస్‌ఐగా కోటేశ్వర్‌రావు



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎస్‌ఐగా కోటేశ్వర్ రావు గురువారం బాధ్యతల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. శాంతి భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు.

ఎంపీ షెట్కార్‌కు అభినందనలు



షెట్కార్‌ను అభినందిస్తున్న రాహుల్‌గాంధీ

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను పార్లమెంట్ పతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందించారు. మహారాష్ట్రలోని నాందేడ్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్‌పార్టీ తరఫున ఇన్‌చార్జిగా షెట్కార్ వ్యవహరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలవంతరావు రవీందర్ చౌహాన్ ఎంపీగా విజయం సాధించారు. గురువారం ప్రియాంకగాంధీ, బలవంతరావు రవీందర్ చౌహాన్ పార్లమెంటులో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం పార్లమెంటు ఆవరణలో చౌహాన్ విజయంలో కీలకపాత్ర పోషించారంటూ షెట్కార్‌ను రాహుల్‌గాంధీ అభినందించారు.

భగీరథ కార్మికులతో చర్చలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మిషన్ భగీరథ పథకం కార్మికులతో రెవెన్యూ అధికారులు గురువారం చర్చలు జరిపారు. చాల్కి సమీపంలోని మిషన్ భగీరథ పథకం ఫిల్టర్ బెడ్ వద్దకు వెళ్లి అక్కడి ఆందోళన చేస్తున్న కార్మికులతో చర్చలు జరిపారు. సమయానికి జీతాలు చెల్లించకపోవడంతో వారు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గురువారం అధికారులు, నాయకులు కార్మికులతో చర్చలు జరపగా తమకు చెల్లించాల్సిన ఏడు నెలల జీతాలు ఇస్తేనే నీటి సరఫరా చేస్తామని తేల్చిచెప్పారు. రెండు నెలల జీతాలు చెల్లించేలా చూస్తామని, మిగిలినవి త్వరలో ఇస్తామని అధికారులు చెప్పగా...అందుకు కార్మికులు ఒప్పుకోలేదు.

డ్రైనేజీ పనుల పరిశీలన

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డుకు సంబంధించిన చాకలి గల్లీలో రూ.5 లక్షలతో మురుగు కాల్వ నిర్మాణ పనులను పురపాలిక ఉపచైర్మన్ శంకర్ ప్రారంభించారు. అనంతరం పనులను పరిశీలించారు. నాణ్యతగా చేపట్టాలని సూచించారు.

వరికొయ్యలు తగలబెట్టొద్దు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

నారాయణఖేడ్: వరికోతలు అయ్యాక వరికొయ్యలను కాల్చొద్దని ఖేడ్ వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోపి తుర్కపల్లి గ్రామంలో వరికొయ్యలు తగలబెడుతున్న పొలాలను పరిశీలించారు. వాటిని కాల్చడం వల్ల కలిగే అనర్థాలను, పర్యావరణ పరిరక్షణకు, భూసారం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి సమగ్రంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ విస్తరణ అధికారి రఘునాథ్ పాల్గొన్నారు.

దీక్షా దివస్ యోధులకు సన్మానం



తండావాసులను సన్మానిస్తున్న లక్ష్మీబాయి

నారాయణఖేడ్: ప్రత్యేక రాష్ట్ర సాధనకు 2009లో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా మండలంలోని పలుగుతండాలో తండావాసులు నిరాహార దీక్షలు చేశారు. కొందరు జైలుకు కూడా వెళ్లారు. దీక్షా దివస్ సందర్భంగా గురువారం ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి తండావాసులను శాలువాలతో సన్మానించారు. మాజీ సీఎం కేసీఆర్, హరీష్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో ఎనిమిది మందిని అదుపులోని తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా, మరో ఇద్దరికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శం

మున్సిపల్ వైస్ చైర్మన్ చింతాగోపాల్

సదాశివపేట(సంగారెడ్డి): మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దామని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా గురువారం బస్టాండ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలే ఆశయాల సాధనకు ప్రజలందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జావిద్, కౌన్సిలర్ చౌదరి ప్రకాష్, మాజీ కౌన్సిలర్ గడీల కృష్ణాగౌడ్, నల్ల సత్యంగౌడ్, నాయకులు అశోక్‌గౌడ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

సత్య శోధకుడు జ్యోతిరావు పూలే

పటాన్‌చెరు: సమన్యాయ సత్య శోధకుడు జ్యోతిరావు పూలే అని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని చిట్కుల్‌లో పూలే చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు విద్య, మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు.ఆయన బాట సమాజానికి అనుసరణీయమని తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి

సంగారెడ్డి రూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని పూలే విగ్రహానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ వెంకటేశ్వర్లు, విఠల్ ,శ్రవణ్‌రెడ్డి, షకీల్, తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి రూరల్: పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్



పటాన్‌చెరు: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు



సదాశివపేట: నివాళులర్పిస్తున్న నాయకులు

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



జోగిపేట: భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ పాండు



ఝరాసంగం: భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

జోగిపేట(అందోల్): వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని ఆర్డీఓ పాండు హెచ్చరించారు. జోగిపేటలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు పరిశుభ్రంగా ఉన్నాయా లేదాని పరిశీలించారు. విద్యార్థినీల కోసం వండిన భోజనాన్ని, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం ఫుడ్‌పాయిజన్ కావడంతో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. అలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. సంక్షేమ హాస్టల్, గురుకులాల నిర్వాహకులు భోజనం విషయంలో ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆయన వెంట మైనార్టీ గురుకుల సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

ఝరాసంగం(జహీరాబాద్): హాస్టల్ విద్యార్థుల సంరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని తహసీల్దార్ తిరుమలరావు అన్నారు. గురువారం ఝరాసంగం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం వడ్డించకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు వడ్డించే భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. అన్నం ముద్దగా ఉండటంతో సరిగ్గా వండకపోతే చర్యలు తప్పవని వంట కార్మికులను హెచ్చరించారు. తప్పనిసరిగా మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షా దివస్ ఏర్పాట్ల పరిశీలన

కంది(సంగారెడ్డి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కందిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో చేపట్టనున్న దీక్షా దివస్ కార్యక్రమ ఏర్పాట్లను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలోనే విఫలమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజావ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రజలంతా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆపార్టీకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. శుక్రవారం చేపట్టనున్న దీక్షా దివస్‌కు జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు జయపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు వాజిద్, వెంకన్న, ఆంజద్, మహమ్మద్ హుస్సైన్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

జహీరాబాద్: ఆస్పత్రి వైద్య ఖర్చుల నిమిత్తం లబ్ధిదారులకు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం పంపిణీ చేశారు. మాణెమ్మకు రూ.60వేలు, లాలప్పకు రూ.45వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పురుషోత్తంరెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఐక్యతను చాటేందుకే వన భోజనాలు

సంగారెడ్డి టౌన్: ఐక్యతను చాటేందుకు కార్తీక వన భోజనాలు నిర్వహిస్తున్నామని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న అన్నారు. గురువారం సంగారెడ్డి ఆర్టీసీ పరిధిలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్తీకమాసంలో నిర్వహించే వనభోజనాలు ఆధ్యాత్మికతను సంతరించుకోవడమే కాకుండా మనలో ఐక్యతను చాటుతుందన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగాలకు ఆటలో పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉపేందర్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

జహీరాబాద్ టౌన్: అసెంబ్లీ సమావేశాల లోపు ఆస్పత్రి కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న కార్మికుల జీతాల నుంచి కాంట్రాక్టర్లు వేల రూపాయలు కాజేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి వేతనం రూ. 26 వేలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐని జమచేయాలని కోరారు. లేని యెడల సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు మహిపాల్, సీఐటీయూ నాయకులు రాజిరెడ్డి, యూనియన్ కార్యదర్శి ఎలిషా పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల రుద్రారం గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక (17), బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించ లేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దేశ రక్షణలో ముందుండాలి**



జోగిపేట(అందోల్): ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణలో ముందుండాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్య అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జోగిపేటలో ప్రధానోపాధ్యాయులు నరేష్‌కుమార్ అధ్యక్షతన వేడుకలు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్మీ తర్వాత సెకండ్ లైన్ ఎన్‌సీసీ ఉంటుందన్నారు. పూర్వ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా 26 సంవత్సరాలు సేవలు అందించిన మాణయ్యను, జోగిపేట ఎన్‌సీసీ ఆఫీసర్ నరోత్తంలను శాలువాతో సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయుల, ఫిజికల్ డైరెక్టర్ వీబీ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **పందులను తరలించండి**

నారాయణఖేడ్: పట్టణంలో సంచరిస్తున్న పందులను ఇతర ప్రాంతాలకు తరలించాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. గురువారం ఆయన పందుల యజమానులతో మాట్లాడారు. కాలనీల్లో, రోడ్లపై పందులు సంచరిస్తుండడంతో స్థానికులు, వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శుక్రవారం లోపు వాటిని తరలించకుంటే తామే వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు.

◆ **రైతు పండుగను విజయవంతం చేయండి**

సదాశివపేట (సంగారెడ్డి): ఈనెల 30న ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగ సభకు జిల్లాలోని రైతులందరూ భారీగా భారీగా తరలిరావాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. కావున రైతు పండుగను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంజీర రైతు సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం**

పటాన్‌చెరు టౌన్: సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మున్సిపాలిటీలో ముదిరాజ్ సంక్షేమ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు పెద్దపీట వేస్తుందన్నారు. గత ఎన్నికల్లో కొన్ని పార్టీలు ముదిరాజ్‌లను విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు టికెట్లు ఇచ్చి గుర్తింపు నిచ్చిందన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులి మామిడిరాజు, శంకర్ పల్లి మండల అధ్యక్షుడు మైసయ్య, బాబయ్య, సంతోష్ పాల్గొన్నారు.

◆ **సౌత్ జోన్ పోటీలకు గీతం కబడ్డీ జట్టు**

పటాన్‌చెరు: ప్రతిష్టాత్మకమైన దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ 'కబడ్డీ మహిళా ఛాంపియన్ షిప్ 2024-25'లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బాలికల జట్టు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు క్రీడల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నారాయణరావు చౌదరి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఛాంపియన్ షిప్ తమిళనాడులోని కరైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2 వరకు జరగనున్నాయని తెలిపారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

నారాయణఖేడ్: కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన అంజమ్మకు సీఎం సహాయనిధి నుంచి రూ.20 వేలు చెక్కు మంజూరయింది. సంబంధిత చెక్కును గురువారం పీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ అందజేశారు. మాజీ ఆత్మకమిటీ చైర్మన్ సత్యం, ఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్ అలీ పాల్గొన్నారు.

◆ **శాశ్వత మార్గ ప్రదాత భగవద్గీత**

జోగిపేట(అందోల్): శాశ్వత మార్గ ప్రదాత భగవద్గీత అని రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవనంద సరస్వతీ అన్నారు. గురువారం జోగిపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో డాక్టర్ అనంతరెడ్డి అధ్యక్షతన గీతా జయంతి మహోత్సవాలను నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో పూజలు నిర్వహించి, కృష్ణుడికి హారతి ఇచ్చారు. అనంతరం భగవద్గీతపై భక్తుల ప్రవచనాలను అందజేశారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

జహీరాబాద్ టౌన్: డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు గురువారం పోలీసులు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. డ్రగ్స్ శరీరంలో పనిచేసే విధానాన్ని మార్చే రసాయనం, కొన్ని మందులు మంచి అనుభూతిని కల్గిస్తాయి.. తరువాత హాని కల్గిస్తాయన్నారు. మెదడు పనితీరును మార్చడం మానసిక స్థితిని దెబ్బతీస్తుందన్నారు. మాదక ద్రవ్యాలు సేవిస్తూ పట్టుబడితే చట్టరీత్యా శిక్షలు పడుతాయన్నారు. తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని చెప్పారు. ఎటువంటి సమాచారం తెలిసినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ నివారణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నందుగౌడ్, దత్తు, నికిత, అధ్యాపకులు నర్సింలు, రమేష్, దీపిక, నవీన, ఇర్షద్ సుల్తానా, సల్మా, శ్వేత, లావణ్య, శిరీష, కరుణ, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ

మెరిట్ ప్రకారం భర్తీ చేయాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: 2024 ఉర్దూ మీడియంలో మిగిలిన ఖాళీలను మెరిట్ ప్రకారంగా ఉర్దూ మీడియం అభ్యర్థులతో భర్తీ చేయాలని ఎస్‌టీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సయ్యద్ సాబేర్ మాట్లాడుతూ.. 2024లో ఉర్దూ మీడియంలో 1183 పోస్టులను ప్రకటించగా కేవలం 517 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. 666 ఖాళీలు భర్తీ కాలేదు.. రిజర్వేషన్ అభ్యర్థులు అందుబాటులో లేకపోవడందె భర్తీ కాలేదన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి ఖాళీ పోస్టులను అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేసి, ఉర్దూ మీడియం పాఠశాలలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌టీయూ నాయకులు ఖలీల్, సమీన్, బషీర్, ఖాజపాషాతో పాటు 400 మంది ఉర్దూ ట్రైనీ టీచర్లు పాల్గొన్నారు.



మహేష్‌గౌడ్‌ను కలిసిన నాయకులు

దశలవారీగా హామీల అమలు

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా నెరవేరుస్తుందని జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న రైతు పండుగ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మెటల్‌కుంటలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. మిగిలిపోయిన రైతులకు కూడా రుణమాఫీ అవుతుందని తెలిపారు. జహీరాబాద్ మార్కెట్ కమిటీ 2023-24 సంవత్సరానికి ఫీజు రూ.2.23కోట్లు లక్ష్యం కాగా రూ.5.13కోట్లు వచ్చిందని, 2024-25 ఏడాదికి టార్గెట్ రూ.3కోట్లు కాగా రూ.39 కోట్లు వచ్చిందన్నారు. మార్కెట్‌కు వచ్చిన ఆదాయంతో అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

కనుల పండువగా..



పల్లకీ, హారతి నిర్వహిస్తున్న జ్ఞానేశ్వర్ మహరాజ్, భక్తులు

మునిపల్లి(అందోల్): కనుల పండుగగా హారతిని జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ నిర్వహించారు. గురువారం పల్లకీ సేవ, హారతీ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగు రోజులుగా జీవన్ముక్త సంస్థానంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే, ఉత్సవాలకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఉండడానికి తగిన ఏర్పాట్లు చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని ఐబీలో కార్మికుల రాష్ట్ర నిర్మాణ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. మధ్యాహ్న కార్మికుల వేతనాలు పెంచాలని సమ్మె చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. సమ్మె తర్వాత రూ.3 వేల జీతాన్ని చెల్లిస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పినా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. డిసెంబర్ 22న మహాసభలను హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్, నాయకులు వెంకటరాజ్యం, శివశంకర్, నాయకులు ఉన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

జోరుగా ధాన్యం కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న కూలీలు

- 74 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- ఇప్పటివరకు 9,127 క్వింటాళ్ల కొనుగోలు

కంది(సంగారెడ్డి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) ద్వారా ప్రభుత్వం చేపట్టిన వరి కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. యాసంగిలో సాగు చేసిన వరి ధాన్యం కోతకు రావడంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బీ గ్రేడ్‌కు రూ. 2300. అలాగే సన్నవరి ధాన్యానికి రూ.2320, బోనస్ రూ.500లు మద్దతు ధర చెల్లిస్తుంది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించిన రైతుల ఖాతాల్లో 72 గంటల్లో డబ్బులు జమ అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. కంది మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కంది, ఇంద్రకరణ్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఐకేపీ ఆధ్వర్యంలో కలివేములలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు కందిలో 139 మంది రైతుల నుంచి 14705 బస్తాలు, 5882 క్వింటాళ్లు ఇంద్రకరణ్‌లో 68మంది రైతుల నుంచి 8113 బస్తాలు, 3245 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సీఈఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు కొనుగోలు కేంద్రాల్లోనే ఉండి పంట నమోదు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు టోకెన్లు జారీ చేస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ధాన్యం తీసుకువచ్చే రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాస్ బుక్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలను అధికారులకు అందజేయాలని సూచించారు. అలాగే ధాన్యాన్ని ఆరబెట్టుకొని తీసువస్తే ఏ గ్రేడ్ ధర పొందవచ్చని తెలిపారు.